అల్పాయుష్కుడు?

వాణిశ్రీ

జగదాంబా జ్యూవెలరీ షాపులో వాళ్ళు ఆమె వంక కన్నార్పకుండా చూస్తున్నారు.

ఆమె ఎర్రటి నైలెక్స్ చీరకు ఎర్రటి పువ్వుల బార్డర్ వున్న చీరతో, ఎర్రటి పోలిస్టర్ బ్లౌజుతో, ఎర్రటి గులాబీలు జడలో తురుముకుని, దివినుండి దిగివచ్చిన దేవ కన్యలా వుంది.

ఆమె హేండ్ బ్యాగ్ కూడా ఎర్రగా కొట్టుకుంటున్న గుండెలా కదుల్తోంది.

సేల్స్‌మాన్ చూపించిన వుంగరాలేవీ ఆమెకు నచ్చలేదు.

"కిరీటం మోడల్‌లో వున్న రింగ్ కావాలి" వీణ మీటినట్లుగా అంటూ నాజూకుగా కదిలింది ఆమె.

ఆమెను చూస్తుంటే అతని గుండె లయతప్పుతోంది.

"అటువంటివి లేవా?" ప్రశ్నించింది ఆమె.

"నో మేడమ్! కావాలంటే ఆర్డర్ మీద తయారు

చేయించి ఇస్తాం” అన్నాడు అతను తేరుకుని.

“ఎంత టైం తీసుకుంటారు?”

“ఎంతో టైం ఎందుకు? ఈవాళ ఆర్డర్ ఇస్తే రేపు ఇచ్చేస్తారు” ఆమె వెనుకనుంచి వచ్చాయి ఆ మాటలు.

ఆమె తల గిర్రున త్రిప్పింది త్రాచుపాములా.

అతను నవ్వాడు.

ఆమె అతన్ని చూసి సిగ్గుతో మొగ్గలా ముడుచుకుపోయింది. ఎర్రటి ముఖం మరింత ఎరుపెక్కి ఎర్రటి లైటు ఫోకస్ చేసినట్లయింది.

“సైజు తీసుకుని క్రౌన్ సైజు రింగ్ తయారుచేయండి. రేపు ఈవెనింగ్ కల్లా ఇవ్వాలి” అన్నాడు అతను.

“యస్సార్” అన్నాడు సేల్స్‌మాన్ ఆమె వేలుసైజు తీసుకుని.

అతను పర్స్‌తీసి వంద కాగితం అందించి “అడ్వాన్సు తీసుకోండి” అన్నాడు.

సేల్స్‌మాన్ రశీదు పుస్తకంతీసి “పేరు చెప్పండి” అన్నాడు.

ఆమె సిగ్గుపడుతూ వుంది. సిగ్గుతో ఆమె గొంతు పెగలడంలేదు.

సేల్స్‌మాన్ వింతగా చూస్తున్నాడు. చివరకు అతనే చెప్పాడు.

“ఫణి రాజకుమారి” అన్నాడు.

“రింగ్‌లో ఏ రంగురాళ్ళు వెయ్యమంటారు?”

“తెల్లరాళ్ళ మధ్య ఎర్రరాయి” అన్నాడు అతను ఆమె టేస్టు తెలిసినవాడికివలె.

ఆమె తల వూపింది.

అతను రశీదు తీసుకుని జేబులో పెట్టుకున్నాడు.

"పద...." అన్నాడు.

ఇద్దరూ షాపులోనుంచి బైటకువచ్చారు.

ఆమె అటూ ఇటూ దిక్కులు చూస్తోంది.

"ఫణీ...." అన్నాడు అతను.

ఆమె తల వంచుకుని "వూఁ...." అంది.

"హోటల్ కెళ్దామా?" అన్నాడు.

"వుహుఁ...." అంది ఆమె.

"ఏం?"

"బాగుండదు....ఎవరైనా చూస్తే...." నెమ్మదిగా అంది.

అతను నవ్వాడు.

"బాగుంది ఫణీ. ఈవాళ ఇరవై రెండో తారీఖు. రెండో తారీఖున పెళ్ళి. గట్టిగా పదిరోజులు లేదు. ఇంతలోకే ఎవరేమనుకుంటారు?" అన్నాడు అతను.

ఆమె మాత్రం "వుహూఁ...." అంటూనే ఆటో కేకేసింది.

ఆటోలో కూర్చుని ఆమె అతనివంక చూసింది క్రీగంట.

అతను నవ్వుతూ చెయ్యి వూపాడు.

ఆటో కదిలింది.

గాలిలో తేలిపోతున్నట్లు పోతోంది ఆటో. ఆటో కంటే వేగంగా కదులుతున్నాయి ఆమె మనసులో మధురమైన వూహలు.

'ఎంత బాగున్నాడు విజయ్!' అనుకుంది.

అతని రూపం కళ్ళముందు కదుల్తోంది. చెవుల్లో మంగళవాద్యాలు మ్రోగుతున్నాయి.

రాబోయే ఆ రోజు.... పెళ్ళిరోజు ఎంత తొందరగా

వస్తే అంత బాగుండును అనుకుంటోంది ఆమె.

ఆమె ఆటో దిగింది 'ఫణి నివాస్' ముందు. ఆ మేడ పైన రెండో అంతస్తు పిట్టగోడకున్న అక్షరాలు ఎర్రగా మెరుస్తున్నాయి 'ఫణి నివాస్' అని.

ఆమె పుట్టాక అదృష్టం కలిసివచ్చిందనే నమ్మకంతో ఆ మేడకు ఆమె పేరు పెట్టాడు తండ్రి.

ఆటోరిక్షా వెళ్ళిపోయాక పోస్టుమన్ వస్తూ కనిపించాడు.

ఆమె వాచీవంక చూసింది. పన్నెండు దాటి పది నిముషాలైంది.

వెడ్డింగ్ కార్డులు ప్రింటై అప్పటికి పదిహేనురోజులు దాటింది. ముఖ్యమైన ఫ్రెండ్స్‌కి పర్సనల్ లెటర్స్ వ్రాస్తూ వెడ్డింగ్ కార్డులు జతచేసి అప్పుడే పోస్టుచేసింది. వాళ్ళనుంచి ఏవైనా లెటర్స్ రావచ్చు అనుకుంటూ అక్కడే నిల్చుంది పోస్టుమన్‌వంక చూస్తూ.

పోస్టుమన్ టపా ఇచ్చాడు. ఆత్రతగా అడ్రసులు చూసింది. అన్నీ ఆమె తండ్రికే వున్నాయి. నిరాశపడింది.

"రిజిష్టర్ పోస్టు ఒకటి వుందమ్మా!" అన్నాడు పోస్టుమాన్.

"నాన్నగారిని పిలుస్తాను వుండు" ఆమె లోపలికి పోబోయింది.

"నాన్నగారికి కాదమ్మా! మీకే" అన్నాడు.

ఆమె ఆశ్చర్యంగా చూసింది.

"నాకా!" ఆశ్చర్యంతో అంది.

"అవునమ్మా!" అంటూ అతను కవరు అందించాడు.

ఫ్రమ్ అడ్రస్ చూసింది. 'రామనాథం' అని వుంది.

'ఎవరబ్బా ఈ రామనాథం?' అని ఆమె మనసులో

ప్రశ్నించుకుంటూనే సంతకం చేసింది.

ఆమె మనసులో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. వేగంగా అడుగులు వేస్తూ తన గదిలోకి వెళ్ళి ఫ్యాన్ ఆన్ చేసి బెడ్ మీద పడుకుని కవరు విప్పింది.

"ప్రియమైన చెల్లీ ఫణి రాజకుమారీ!

నీకు మున్సిపల్ ఛైర్మన్ గారి అబ్బాయి విజయ్‌తో పెళ్ళి నిశ్చయమైందని తెలిసి సంతోషించడం లేదు. ఎంతో విచారిస్తున్నాను. విజయ్ అందగాడే. ఒడ్డూ పొడుగూ వుండి హీరోలా వుంటాడు. నాకు తెలుసు.

కాని పాపం అతను అల్పాయుష్కుడు. అతను నువ్వనుకున్నంత మంచివాడు కాదు. ధనగర్వంతో, అధికార మదంతో ఎన్నో పాపాలు చేశాడు. ప్రస్తుతం ఆ పాపాల పడగ నీడలో పయనిస్తున్నాడు. ఆ పడగ ఏ క్షణంలోనైనా బుసకొట్టి కాటువేయవచ్చు. అతని ఆయుష్షు రోజుల్లోనే వుంది.

చెల్లీ! అల్పాయుష్కుణ్ని పెళ్ళిచేసుకుని నిండు నూరేళ్ళ జీవితాన్ని చేజేతులా పాడుచేసుకోకు.

ఆలోచించుకో, మేలుకో, జాగ్రత్తపడు.

ఈ పెళ్ళి నీ పాలిట వురిత్రాడు కాకుండా చూసుకో.

—నీ ప్రియమైన అన్నయ్య,
వల్లకాటి రామనాథం."

అదంతా చదివి ఫణి ముఖం చెమటపట్టింది.
'అమ్మా' అని గావుకేక పెట్టింది.

2

వల్లకాటి రామనాథం రాసిన వుత్తరం చదివి విజయ్ తండ్రి అప్పలనాయుడు కంగారుపడలేదు. తాపీగా చుట్ట వెలిగించుకుని గుప్పుగుప్పున పొగవదిలాడు.

సాలోచనగా కాబోయే వియ్యంకుడు వెంకటస్వామి వైపు చూసి "మరి నువ్వు ఏమనుకుంటున్నావ్?" అన్నాడు అప్పలనాయుడు.

"నాకేం తోచడంలేదు. అమ్మాయి దిగులుపడి పోయింది. ఇక మీ చెల్లెలు ఏడుపు మొదలెట్టింది. నాకు బుర్ర తిరిగిపోయి నీ దగ్గరికి పరిగెత్తుకొచ్చాను" అన్నాడు వెంకటస్వామి.

"ఇది ఆకాశరామన్న వుత్తరం" అన్నాడు అప్పలనాయుడు.

"అందులో వల్లకాటి రామనాథం అని వుందిగా!"

"నీ తెలివి తెల్లారినట్లేవుందోయ్ బామ్మర్ది" అని పక-పక నవ్వాడు అప్పలనాయుడు. నవ్వినవ్వి ఆయాసం తీర్చుకుని "ఆకాశరామన్న తమ్ముడే వల్లకాటి రామనాథం అంటేను" అన్నాడు.

"నాకేమిటో భయంగా వుంది బావా!" అన్నాడు వెంకటస్వామి.

"ఇదంతా మన అపోజిషన్ పార్టీ సుబ్బరాజు రాయించి వుంటాడు."

"సుబ్బరాజు ఎందుకు రాయించుతాడు?"

"ఎందుకేంటి? నువ్వూ నేనూ వియ్యమందితే మరిక ఈ మున్సిపాలిటీ ఛైర్మన్ సీటు అపోజిషన్ వాళ్ళకి దక్కదని భయపడి రాయించి వుంటాడు."

వెంకటస్వామి ఆలోచనలోపడ్డాడు.

"నువ్వేం భయం పెట్టుకోకు. ఇన్నాళ్ళూ మనం విరోధంగా వున్నాం. అయినా ఎలాగో నెగ్గుకొచ్చి ఛైర్మన్ పదవి నిలుపుకొస్తున్నాను. ఇక మనం ఒకటైతే వెయ్యి జన్మలెత్తినా సుబ్బరాజు ఛైర్మన్ కాలేడు. నా తర్వాత మావాడు ఛైర్మన్ కాకతప్పదు. అదుగో అందుకు సుబ్బరాజు ఏసిన ఎత్తు ఇది" అన్నాడు అప్పలనాయుడు.

"అంతేనంటావా?" అన్నాడు వెంకటస్వామి.

"అంతగాక మరింకెంత? ఆ ఉత్తరం చదివితే తెలిసిపోడం లేదా కతంతా! ఎవడో ఈ పెళ్ళి చెడగొట్టడానికి ఏసిన ప్లానని" గట్టిగా అన్నాడు అప్పలనాయుడు.

వెంకటస్వామి మౌనం వహించాడు. అతని మనసు గందరగోళంగా వుంది. ఆ ఉత్తరం తల్చుకుంటేనే వికారంగా వుంది. అల్లుడు అల్పాయుష్కుడని తెలిసి తెలిసి పిల్లనివ్వడం ఎలా? శుభలేఖలు అచ్చయిపోయాయి. కట్నంలో కొంత అడ్వాన్సుగా ఇచ్చాడు. ఈ పరిస్థితిలో పెళ్ళి ఆపడం ఎలా?

"నీకైతే ఇలా ఉత్తరాలు రాశారు. నాకైతే ఫోన్ చేస్తున్నారు రోజూ!" అన్నాడు అప్పలనాయుడు.

"ఎవరు?"

"ఏమో! ఏ వల్లకాటి రామనాథమో, ఆకాశరామన్నో? ఎవరని చెప్పగలం?"

"ఏమని చేస్తున్నారు?"

"ఎందుకలే అవన్నీ వింటే బాధపడతావు?"

"ఫరవాలేదు చెప్పు" అన్నాడు వెంకటస్వామి.

"నీ కూతురు మంచిది కాదట. రెండుసార్లు కడుపు తీయించుకుందట" వదలకూడని మాట వదిలాడు.

ఆ మాటలు వింటూనే వెంకటస్వామి ముఖం కోపంతో కందగడ్డ అయింది.

"అవన్నీ నేను నమ్ముతానా! ఎలాగైనా ఈ పెళ్ళి చెడగొట్టాలని వాళ్ళ ఎత్తులు" అన్నాడు అప్పలనాయుడు కుటిలంగా నవ్వుతూ.

అప్పలనాయుడు సుబ్బరాజుతో వైరం గురించి వివరంగా చెప్పాడు. ఈ పెళ్ళి జరిగినందువల్ల ఎక్కువ నష్టం అతనికే గనుక అతనే ఈ కుట్రపన్నాడని ఘంటాపథంగా అప్పలనాయుడు చెప్పాక వెంకటస్వామికి నిజమేననిపించింది.

వెంకటస్వామికి గుండె ధైర్యం వుందిగాని అతని భార్య అనంతలక్ష్మి మాత్రం ముక్కు చీదుకుంటూ, కళ్లు తుడుచుకుంటూ వుంది. ఈ పెళ్ళిమాత్రం జరిగేదానికి వీల్లేదని పట్టుపట్టింది. ఫణి రాజకుమారి శోకదేవతలా ఏడుస్తూ బెడ్ మీదనుంచి లేవడంలేదు.

అప్పలనాయుడు సరిచెప్తే వెంకటస్వామి సర్దుకున్నాడుగాని వెంకటస్వామి చెప్తే మాత్రం అతని భార్య ససేమిరా సర్దుకోవడంలేదు.

వెంకటస్వామికి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా వుంది. హాల్లో పచార్లు చేస్తున్నాడు ఏం చెయ్యాలో తోచక. అతని భార్య మాత్రం జోరీగలా గొణుగుతూనే వుంది.

"అయితే ఇప్పుడు నన్నేంచేసి చావమంటావు?" అని విరుచుకు పడ్డాడు వెంకటస్వామి అసహనంగా.

"అబ్బాయి జాతకం తీసుకుని రమ్మనండి వాళ్ళ నాన్నని. మన రామశాస్త్రులు చూసి చెప్తాడు. అసలు ముందే జాతకాలు చూసుకోకుండా ముహూర్తాలు పెట్టు

కోవడం మన తప్పు" అంది.

వెంకటస్వామి టెలిఫోన్ ఎత్తి రింగ్ చేశాడు.

అవతల అప్పలనాయుడు పలికాడు.

"నాయుడూ! మీ చెల్లెలు ఒకటే గొడవచేస్తున్న దయ్యా! అబ్బాయి జాతకం తీసుకుని వెంటనే బయల్దేరి రా!" అన్నాడు.

అవతల అప్పలనాయుడు సరేనన్నాడు. రామశాస్త్రిని రమ్మని నౌకరుతో కబురుచేశాడు వెంకటస్వామి.

రామశాస్త్రి తన సరంజామాతో హడావుడిగా వచ్చేశాడు. తర్వాత అప్పలనాయుడూ వచ్చాడు కొడుకు నక్షత్రం, జాతక చక్రం వగైరా తీసుకుని.

"చూడు పంతులూ! ఎవడో మనవంటే గిట్టనోడు అబ్బాయి అల్పాయుష్కుడని ఉత్తరం రాసి పడేశాడు అమ్మాయికి. మగవాళ్ళవంటే ధైర్యంగా వున్నాం. ఆడాళ్ళుగదా బెంబేలెత్తిపోతున్నారు. జాగ్రత్తగా చూడు అబ్బాయి జాతకం. సెంట్రల్లో మినిష్టరై పోతాడని అందులో వుంటే...." అన్నాడు అప్పలనాయుడు.

రామశాస్త్రి గ్రహబలం, రాసిఫలితాలు చూస్తూ కూడికలూ, తీసివేతలూ వేస్తూ కూర్చున్నాడు. అంతా సస్పెన్స్ సినిమా చూస్తున్నట్లు నిశ్శబ్దంగా మాటా పలుకూ లేకుండా అతనివంక రెప్పలు కొట్టడం మానేసి చెవులు రిక్కించి కూర్చున్నారు.

ఇంతలో టెలిఫోన్ మ్రోగింది.

వెంకటస్వామి లేచి వెళ్ళి రిసీవర్ ఎత్తి "హలో.... వెంకటస్వామిని మాట్లాడుతున్నాను" అన్నాడు.

అవతల వ్యక్తి చెప్పిన విషయం విని వెంకటస్వామి ముఖం నల్లగా మాడిపోయింది.

"నాయుడూ! రావయ్యా! అక్కయ్య మాట్లాడుతూ వుంది. లీలామహల్ దగ్గర మోటార్ సైకిల్ యాక్సిడెంటయిందట. విజయ్‌ని హాస్పిటల్లో చేర్పించారట" అన్నాడు వెంకటస్వామి రిసీవర్ ఎత్తి పట్టుకుని.

అప్పలనాయుడు ఎగిరిపడి ఒక్క అంగలో టెలిఫోన్ దగ్గరికెళ్ళి రిసీవర్ అందుకున్నాడు.

రామశాస్త్రి దీర్ఘంగా నిట్టూర్చాడు.

"అబ్బాయికి రెండు గండాలున్నాయి. అవి తప్పితే అద్భుతమయిన జాతకం" అన్నాడు.

"మీరు లక్ష చెప్పండి. ఈ సంబంధం నేను చస్తే ఒప్పుకోను" అని గట్టిగా అరిచింది అనంతలక్ష్మి.

"అబ్బ! కాస్త ఆగవే...." అన్నాడు వెంకటస్వామి ఇబ్బందిగా అప్పలనాయుడివంక చూస్తూ.

"ఈ పెళ్ళి చేస్తే నేను వురిపోసుకుని చస్తాను" అని గట్టిగా కేకలేసుకుంటూ నిష్క్రమించింది అనంతలక్ష్మి.

అప్పలనాయుడు టెలిఫోన్ విసురుగా పడేసి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వెళ్ళిపోయాడు. వెంకటస్వామి అతన్ని అనుసరించాడు.

రామశాస్త్రి బొమ్మలా ఒక్కడే హాల్లో కూర్చుండి పోయాడు.

3

హాస్పిటల్ స్పెషల్ రూమ్‌లో మూలుగుతూ పడుకుని వున్నాడు విజయ్.

అతని చేతికి పిండికట్టు కట్టివుంది. అక్కడక్కడా ప్లాస్టరు అతికించి వున్నాయి. మోటార్ సైకిల్ యాక్సిడెంట్‌లో అతని కుడిచేతి ఎముక విరిగింది.

వారం రోజులుగా అతను బెడ్ మీద వుంటే ఒక్క సారిగూడా ఫణిరాజకుమారి రానందుకు అతనికి యెంతో బాధగా వుంది. వెంకటస్వామి మాత్రం ఒకటి, రెండు సార్లు వచ్చి పరామర్శించిపోయాడు. కాబోయే అత్తగారు కనీసం తొంగిచూడలేదు.

పెళ్ళి ఇంకా నాలుగురోజులేగా వుంది. అప్పటికి తనచెయ్యి సెట్ రైట్ అవుతుందా?

ఎలా అవుతుంది?

ఒకవేళ పెళ్ళి పోస్టుపోన్ చేస్తారేమో? నాన్న యే సంగతీ చెప్పలేదే?

విజయ్ బుర్రలో రకరకాల సందేహాలు మొలకెత్తుతున్నాయి.

అలాగే ఆఫీసులో కూర్చున్న అప్పలనాయుడి బుర్ర తిరిగిపోతోంది ఆలోచనలతో.

టెలిఫోన్ మ్రోగి అతని ఆలోచనలకు అంతరాయం కలిగించింది.

విసుగ్గా తీశాడు రిసీవర్. పెళ్ళి ఆగిపోయిన సంగతి తెలిసి అడ్డమయిన ప్రతివాడూ ఫోన్ చేసి అడిగేవాడే. చెప్పలేక ప్రాణం పోతోంది అతనికి.

"ఛైర్మన్ గారా! నమస్కారం సార్!"

"నమస్కారం.... నమస్కారం"

"అబ్బాయి హాస్పటల్లో వున్నాడుగదా! ఎలావుంది యిప్పుడు?"

"ఫరవాలేదండీ కోలుకుంటున్నాడు."

"కోలుకుంటాడు లెండి. చెయ్యి మాత్రమే గా విరిగింది."

"ఆఁ .... ఏదో దేవుడిదయవల్ల అంతటితో సరి

పోయింది."

"అవును మీరు చేసిన పుణ్యం వూరికేపోతుందా? అన్నట్లు అబ్బాయి కోలుకున్నాక మీ బిజినెస్ వ్యవహారాలకి దూరంగా వుంచండి."

"అంటే...."

"అదే మీ సినిమాహాలు దగ్గరకీ, మీ సిటీబస్సు రూట్లమీదకీ తోలకండి."

"ఏం....ఎందుకలా అంటున్నారు."

"ఎందుకంటే మీవాడి వ్యవహారం బాగోలేదు. ఏదో మోటర్ సైకిల్ యాక్సిడెంటుతో సరిపోయిందనుకుంటున్నారా! ఈసారి ప్రాణానికే ముప్పు కలగొచ్చు...."

నవ్వు వినిపించింది.

ఆ నవ్వు అప్పలనాయుడికి గుండెదడ కలిగించింది.

"ఇంతకీ ఎవరు మీరు?" ఆందోళనగా ప్రశ్నించాడు.

"నేనా వల్లకాటి రామనాథాన్ని."

ఫోన్ పెట్టేసినట్లు క్లిక్ మని శబ్దం వచ్చింది.

4

స్నేహితుడు చెప్పినమాట విని విజయ్ ముఖం కోపంతో యెర్రబడింది.

"నీకు నిజంగా తెలియదా?" అన్నాడు అతను.

"నిజంరా!" అన్నాడు విజయ్.

"గమ్మత్తుగా వుందే!"

"పెళ్ళి పోస్టుపోన్ చేశారేమో అనుకుంటున్నాను గాని...."

"నేనూ ఆశ్చర్యపోయాను. నిజంగా ఫణిరాజకుమారికి మరో సంబంధం చూస్తున్నారు. నిన్ననే పెళ్ళిచూపులు జరిగాయి. ఆ కుర్రాడు హౌస్ సర్జన్ గుంటూ

రులో. మా చెల్లెలు చెప్పింది నిన్న. తను అక్కడే వుందట. దాదాపు సెటిల్ అయిపోయినట్లే అంది. కట్నం దగ్గరే బేరం జరుగుతున్నదట" అన్నాడు గోపాల్.

"ఎందుకు జరిగి వుంటుంది యిలా?" ప్రశ్నించాడు విజయ్.

"ఏమో! నాకూ అదే అర్థం కావడంలేదు. అయినా మీతో పెళ్ళి ఖాయం చేసుకుని, శుభలేఖలు పంచి పెట్టాక మానుకోవడానికి ఆ వెంకటస్వామికి యెంత ధైర్యం" అన్నాడు గోపాల్.

విజయ్ ముఖం అవమానంతో ప్రజ్వరిల్లుతోంది.

"సారీరా విజయ్! నీకు తెలుసేమోనని ఆ ప్రస్తావన తెచ్చాను" అన్నాడు గోపాల్ బాధను వ్యక్తం చేస్తూ.

"ఎప్పటికయినా తెలియాల్సిందే గదా! ఎన్నాళ్ళు దాస్తారు" అన్నాడు విజయ్.

ఫణిరాజకుమారితో పెళ్ళి ఆగిపోయిందని తెలిసి గుండె ఆగిపోయినట్లయింది విజయ్‌కి. ఇక ఆమె పరాయి దయి పోతున్నదనే వార్త గుండెను దహించి వేస్తోంది. బాధతో మనసు ముక్కలయి పోతోంది. కోపంతో రక్తం సలసలా కాగిపోతోంది.

'ఎందుకిలా జరిగింది?' అనే ప్రశ్న అతని మనసులో కుమ్మరి పురుగులా తొలిచివేస్తోంది.

వస్తూనే విజయ్ వాలకంచూసి అసలు సంగతి తెలిసి పోయింది కాబోలు అనుకున్నాడు అప్పలనాయుడు.

"నాకీ సంగతి యెందుకు చెప్పలేదు?" సూటిగా ప్రశ్నించాడు తండ్రిని.

"ఏ సంగతి?" ఏమీ తెలియనివాడిలా అన్నాడు.

"వాళ్ళతో పెళ్ళి సంబంధం చెడిపోయిందని."

"ఓ....అదా! పోతే పోయింది వెధవ సంబంధం. అది కాకపోతే దాని బాబులాంటి సంబంధం కాళ్ళదగ్గరికి వస్తుంది. అదేమంత ముఖ్యమైన విషయమా మనకు?"

"నీ రాజకీయాలు నా దగ్గర మాట్లాడకు. సూటిగా చెప్పు. ఎందుకు చెడిపోయింది?"

అప్పలనాయుడు కొడుకువంక సీరియస్‌గా చూసి "వాళ్ళు మూర్ఖులు. ఏదో నీకు యాక్సిడెంట్ జరిగిందని భయపడి అశుభం అనుకున్నారు. పోనీ....ఇప్పుడేం కొంప మునిగిందని?" అన్నాడు.

"శుభలేఖలు అచ్చుకొట్టించాక యెవరయినా పెళ్ళి మానుకుంటారా? యాక్సిడెంటు జరిగితే మాత్రం నిశ్చయమయిన పెళ్ళి యెలా ఆగుతుంది? నేను నమ్మను. ఏదో వుంది. నువ్వు దాస్తున్నావు" అన్నాడు విజయ్.

అతనికి రకరకాల అనుమానాలు వస్తున్నాయి. లోగడ తనుచేసిన రంకు వ్యవహారాలు యేవయినా బైట పడి వాళ్ళకు తన సంగతి తెలిసిపోయిందేమోనని.

అప్పలనాయుడు చుట్ట వెలిగించి సీరియస్‌గా వుండి పోయాడు కాసేపు.

తర్వాత వల్లభాటి రామనాధం రాసిన వుత్తరం తీసి చేతికిచ్చాడు.

"అదిరా సంగతి. అది చూసి ఆ పిల్ల, ఆ పిల్ల తల్లీ తెగ భయపడిపోతున్నారు. వెంకటస్వామి తప్పేంలేదు యిందులో. దానికి తగ్గట్టు నీకు యాక్సిడెంట్ జరగడంతో హడలిపోతున్నారు" అన్నాడు అప్పలనాయుడు.

కాసేపు కూర్చొని వెళ్ళిపోయాడు.

విజయ్‌కి ఆ అక్షరాలు చూడగానే జ్ఞాపకం వచ్చింది

పద్మావతి.

'అవును ఆ అక్షరాలు పద్మావతివే' అనుకున్నాడు. పద్మావతి అతని మాజీ ప్రియురాలు. ఆమెపై మోజు తీరగానే మొఖం చాటేశాడు, ఏడాదిక్రితం.

"నన్ను అన్యాయంచేసి నువ్వెలా సుఖపడతావో చూస్తాను" అన్న పద్మావతి చివరిసారి మాటలు చెవుల్లో గింగురుమని మ్రోగాయి.

'ఇదంతా దాని పనే. రాక్షసి! బంగారంలాంటి సంబంధం చెడగొట్టింది' అనుకున్నాడు.

'విజయ్‌తో పేచీ పెట్టుకునే ధైర్యం వచ్చిందా నీకు. నీపని పడతాను' కసిగా అనుకున్నాడు విజయ్.

5

విజయ్ చెయ్యి పూర్తిగా నయమైంది. డిశ్చార్జి అయ్యాక అప్పలనాయుడు కొడుకుని ఎక్కడికీ వెళ్ళవద్దని ఆంక్ష పెట్టాడు. మోటార్ సైకిల్ మీద తిరగవద్దని గట్టిగా మందలించాడు.

విజయ్ తండ్రి మనసు అర్థంచేసుకున్నాడు.

'వల్లకాటి రామనాథానికి భయపడుతున్నాడు. వాడెవడో తేల్చేస్తాను' అనుకున్నాడు.

'అలాగేలే' అన్నాడు తండ్రి తృప్తికోసం.

ఒకరోజు అప్పలనాయుడు అర్జెంట్ పని మీద హైదరాబాద్ వెళ్ళాడు. వెళ్ళేటప్పుడు కొడుక్కి మరీ మరీ చెప్పాడు ఇల్లు కదలవద్దని. సినిమాహాలుకి వెళ్ళవద్దనీ, సిటీ బస్సులు ఎక్కవద్దనీ, కావాలంటే కారు వాడుకో మనీ ఎన్నో జాగ్రత్తలు చెప్పి మరీ వెళ్ళాడు.

విజయ్‌కి పద్మావతి సంగతి తేల్చుకోవాలని పట్టుదల పెరిగింది. తండ్రి మాత్రం సుబ్బరాజు మీద అనుమాన

పడుతున్నాడు గాని విజయ్‌కి మాత్రం పద్మావతిమీదే వుంది.

తనను ఎంతో ద్వేషిస్తోంది పద్మావతి. తన చేతిలో మోసపోయింది గనుక తనను నవ్వులపాలు చెయ్యడానికి ప్రయత్నిస్తోంది. ఆమె ఒక కాటన్ మిల్ ఓనరు.

టెలిఫోన్ డైరెక్టరీ వెతికి పద్మావతి ఫ్యాక్టరీకి ఫోన్ చేశాడు. ఎవరో టెలిఫోన్ ఎత్తారు. తనకు పద్మావతి కావాలన్నాడు. మీరెవరని అతను అడిగాడు. తను పద్మావతి బంధువునని చెప్పాడు. కొన్ని నిముషాల తర్వాత పద్మావతి లైనులోకి వచ్చింది.

"గుడ్ మార్నింగ్ పద్మా!"

"గుడ్ మార్నింగ్. ఎవరు?"

"నేను విజయ్‌ని."

"విజయ్‌వా? ఏమిటి సంగతి?"

"ఏం లేదు. ఇంకా నామీద కోపం పోలేదా?"

"నాకెందుకు కోపం?"

"ఎందుకో నాకు తెలుసు. నిన్ను పెళ్ళి చేసుకోలేదని."

"దేశంలో మగాళ్ళు చాలామంది వున్నారు. నేను చేసుకోదల్చుకుంటే క్యూలో నిల్చుంటారు. మైండిట్. అయినా ఫోన్ ఎందుకు చేశావు? నీ పెళ్ళికి ఆహ్వానమా?"

"నా పెళ్ళి ఆగిపోయిందిగా నీ పుణ్యమా అని."

"నీ పెళ్ళి ఆగిపోయిందా? ఎవరో పెళ్ళి అని అన్నారుగాని ఆగిపోయిందని అనలేదే! నేనీ మధ్య వూళ్ళో లేనులే. నిన్ననే వచ్చాను. అయినా నీ పెళ్ళి నా పుణ్యాన ఆగిపోవడం ఏమిటి ఫార్స్‌గా వుందే...." నవ్వు వినిపించింది.

"ఫార్స్‌గానే వుంటుంది. నా గురించి లేనిపోనివి

కల్పించి నాకు కాబోయే వైఫ్‌కి లెటర్ రాశావుగా. నువ్వు అనుకున్నట్టే జరిగిందిలే."

"విజయ్! ఏమిటి నువ్వు అంటున్నది? నేను నీకు కాబోయే వైఫ్‌కి లెటర్ రాశానా? ఇది మరీ తమాషాగా వుంది. నీకు పిచ్చిగాని ఎక్కలేదుగదా!"

"కొన్నాళ్ళు ఆగితే పిచ్చిగూడా ఎక్కుతుంది. ఎంతో తెలివిగా చేస్తున్నానని నువ్వు అనుకుంటున్నావు గాని నీ దస్తూరి నాకు బాగా తెలుసు. ఆ లెటర్ నువ్వు రాసిందే."

"నో....నువ్వు పొరబడుతున్నావు విజయ్!"

"ఆ లెటర్ నా దగ్గరే వుంది. నీకు చూపిస్తాను కావాలంటే. అప్పుడైనా నిజం ఒప్పుకోక తప్పదు."

"సరే అలాగే చూపించు."

"ఎక్కడికి రమ్మంటావు? మీ ఇంటికి రానా?"

"వద్దు. రాత్రి ఎనిమిది దాటాక మా గెస్టుహౌస్‌కిరా. నీ కోసం ఎదురుచూస్తుంటాను. బైదిబై నీకు డిన్నర్ గూడా అరేంజ్ చేస్తున్నాను. చాలా కాలం తర్వాత కలుసుకుంటున్నాముగదా!...." నవ్వుతూ అంది పద్మావతి.

"గెస్టుహౌస్‌కా! ఎక్కడ అది?"

"ఓ....నీకు తెలీదుగదూ! మా కస్టమర్స్ కోసం ఈమధ్యే కట్టించాం. మా ఫ్యాక్టరీ ఆవరణలోనే వుంది. గేటుదగ్గర మా వాచ్‌మాన్ వుంటాడు చూపిస్తాడులే."

"ఓకే...." అన్నాడు విజయ్.

అవతల టెలిఫోన్ పెట్టేసినట్లు క్లిక్‌మంది.

రాత్రి ఎనిమిదింటివరకూ ఓపికపట్టాలంటే చాలా కష్టమైపోయింది అతనికి. వల్లకాటి రామనాథం రాసిన

లెటర్ భద్రంగా జేబులో పెట్టుకున్నాడు.

అతని మనసులో రకరకాల ఆలోచనలు రేగుతున్నాయి. పద్మావతి మాటలు చూస్తుంటే తనపై ఏమాత్రం కోపం వున్నట్లు లేదు. పైగా డిన్నర్‌కి రమ్మని ఆహ్వానించింది. ఆమెకు తనమీద కోపం పోయిందా? లేక ఇదే అదనుగా డిన్నర్‌లో ఏదైనా విషం పెట్టి....

విజయ్ శరీరం భయంతో రోమాంచితమయింది.

'ఓహ్! ఆడదాన్ని అంత తేలికగా నమ్మరాదు. తను చేసిన మోసాన్ని అంత త్వరగా మర్చిపోయిందని అనుకోవడం తన తెలివితక్కువతనం. తనను మట్టుపెట్టడానికి ప్లాను వేస్తున్నదేమో! లేకపోతే తనను రాత్రిపూట ఎందుకు రమ్మంటుంది? పైగా డిన్నర్ అని ఆహ్వానించడం....'

'అసలు వెళ్ళకపోతేనో' అని ఆలోచించాడు ఒకదశలో.

'కాని వెళ్ళకపోతే ఎలా' అనుకున్నాడు.

ఆలోచనలతోనే కాలం గడిచిపోయింది. ఏడున్నరకి కారు స్వయంగా డ్రయివ్ చేసుకుంటూ బయల్దేరాడు. పద్మావతి తనను మోసగించడానికి అవకాశం ఇవ్వదలచుకోలేదు. 'తను అక్కడ ఏమీ ముట్టుకోకూడదు' అని నిర్ణయించుకున్నాడు. ఎందుకయినా మంచిదని ఆరు అంగుళాల కత్తి ప్యాంట్ జేబులో పెట్టుకొన్నాడు. తగు జాగ్రత్తలలో బయల్దేరాడు.

ఫ్యాక్టరీ గేటు మూసివుంది.

విజయ్ హారన్ కొట్టాడు.

వాచ్‌మాన్ చిన్న గేటుతీసి కారుదగ్గరకి వచ్చాడు.

"ఎవరు సార్?" అంటూ దగ్గరకు వచ్చాడు.

"నేనే విజయ్‌ని" అన్నాడు విజయ్.

"సార్ మీరా? రండి, అమ్మగారు మీకోసం ఎదురు చూస్తున్నారు" అన్నాడు వాచ్ మాన్.

అతను విజయ్‌కి గుర్తే. అతని పేరు పెంటయ్య.

పెంటయ్య గేటు తాళంతీసి బార్లా తెరిచాడు.

విజయ్ కారు లోపలకు పోనిచ్చి ఒకప్రక్కగా ఆపాడు.

విజయ్ ఫ్యాక్టరీ ఆవరణంతా పరీక్షగా చూశాడు. కుందలకొద్ది ఆయిల్ డ్రమ్ములు గుట్టలకొద్ది పేర్చివున్నాయి. దూరంగా ఫ్యాక్టరీలో ప్రతిచోట్లు....అన్నీచూసి ఒక్క యేడాదిలో బిజినెస్ బాగా ఇంప్రూ చేసిందే అను కున్నాడు విజయ్.

"ఏం పెంటయ్యా...."

"అయ్యా!"

"ఫ్యాక్టరీ జోరుగా సాగుతున్నదే. రాత్రిళ్ళుగూడా పని సాగుతున్నదే" అన్నాడు.

"ప్రతిసీజను గదయ్యా!" అన్నాడు పెంటయ్య చేతులు నలుపుకుంటూ.

"అమ్మగారు ఎక్కడున్నారు?"

"అదిగోనయ్యా! అదే కొత్తగా కట్టిన ఇల్లు" అంటూ చెయ్యెత్తి చూపించాడు పెంటయ్య.

"అమ్మగారు రోజూ ఇక్కడే వుంటారా?" ప్రశ్నించాడు విజయ్.

"లేదయ్యా! ఎవరన్నా బయటోళ్ళు వస్తే వుంటూ వుంటారయ్యా! అమ్మగారు ఇంటికెళ్ళిపోతారయ్యా! ఈ రోజు తమకోసం...." అన్నాడు పెంటయ్య.

"ఇంకా యెవరన్నా వున్నారా? అక్కడ."

"లేదయ్యా! వంటరిగా నే వున్నారయ్యా!" అన్నాడు

పెంటయ్య.

విజయ్ గెస్ట్‌హౌస్ వైపు నడిచాడు.

ఫ్యాక్టరీకి చాలా దూరంలో వుంది గెస్టుహౌస్. దాదాపు రెండువందల గజాలదూరం వుంటుంది అక్కడికి. పెద్ద పెద్ద వేపచెట్లమధ్య అందంగా అధునాతనంగా కట్టబడింది.

చుట్టూ ముళ్ళతీగతో ఫెన్సింగ్ వుంది. ఇనుపగేటు తీసుకొని ఆవరణలోకి ప్రవేశించాడు. క్రోటన్స్ పూల మొక్కలు నీటుగా పెరిగివున్నాయి.

కాలింగ్ బెల్ నొక్కబోయి ఆగిపోయాడు విజయ్.

తలుపు ఓరగా తీసేవుంది. డోర్ కర్టెన్ సన్నగా కనిపిస్తూనే వుంది.

తలుపు నెట్టుకుని లోపలకు ప్రవేశించాడు.

హాలు విశాలంగా వుంది. నాలుగు సోఫాలు, దేకోలం టీపాయ్ అమర్చివున్నాయి. ఒకమూల టేబులుమీద రేడియో వుంది. దానికి ఎదురుగా నిలువెత్తు అద్దం వుంది.

రెండుగదులు కన్పించాయి. ఒకటి తీసివుంది. రెండో గది లాక్ చేసి వుంది.

"పద్మా" అన్నాడు విజయ్.

సమాధానం రాలేదు.

"పద్మా!" అంటూ గదిలోకి వెళ్ళాడు.

అంతే. వెళ్ళినవాడు స్థాణువులా నిలబడిపోయాడు. కళ్ళు పెద్దవిచేసి చూస్తూండిపోయాడు. భయంతో గుండె వెయ్యిమైళ్ళ స్పీడుతో కొట్టుకుంది. కాళ్ళు వణికాయి.

బెడ్‌మీద రక్తపు మడుగులో పడివుంది పద్మావతి.

విజయ్‌కి గొంతులో తడి ఆరిపోయింది.

మెదడు మొద్దుబారి నట్లయింది. ఏం చెయ్యాలో

తోచలేదు.

అలాగే గుమ్మంలో నిలబడిపోయాడు.

పద్మావతి బెడ్‌మీద పడుకుని వుంది. ఆమె గుండెల్లో కత్తి దిగబడి వుంది. రక్తంతో తెల్లటి బెడ్‌షీటు ఎర్రగా మారివుంది.

విజయ్ గిర్రున వెనక్కి తిరిగాడు. దాదాపు పరుగు వంటి నడకతో కారుదగ్గరకి చేరుకున్నాడు.

కారుయెక్కి స్టార్టుచేసి హారన్ మ్రోగించాడు. ఎక్కడ్నుంచో వచ్చి పెంటయ్య గేటు తాళంతీసి తెరిచాడు.

"అప్పుడే వెళ్ళిపోతున్నారేం అయ్యా?" నవ్వు ముఖంతో అడిగాడు వాచ్‌మాన్ పెంటయ్య.

విజయ్‌కి కంగారులో ఏం చెప్పాలో తోచలేదు. మాట్లాడకుండా కారు నడుపుకుని వెళ్ళిపోయాడు.

6

విజయ్ ఫ్యాక్టరీనుంచి వెళ్ళిపోయాక అయిదు నిమిషాల తర్వాత క్యారేజి పట్టుకుని మల్లయ్య ఫ్యాక్టరీకి వచ్చాడు. మల్లయ్య పద్మావతి ఇంట్లో పనిచేసే నౌకరు.

చిన్న గేటు తెరుస్తూ "ఏం మల్లయ్యా! క్యారేజ్? అమ్మగారు ఇంటికి రానందా?" నవ్వుతూ అన్నాడు పెంటయ్య.

"ఏమో? ఇద్దరికి భోజనం పంపమని కబురుచేశారు" అన్నాడు ముక్తసరిగా.

మల్లయ్య గెస్టుహౌస్‌లోకి వెళ్ళిన కొన్ని నిముషాలకు కెవ్వున కేకలు వేస్తూ పరుగెత్తుకొచ్చాడు. ఆ కేకలు గేటు దగ్గర నిల్చున్న పెంటయ్యకు వినిపించాయి.

కాలుస్తున్న బీడీ అవతలపారేసి కంగారుగా మల్లయ్య వస్తున్నవేపు పరిగెత్తాడు పెంటయ్య.

మల్లయ్య భయంతో వణికిపోతూ కనిపించాడు.

"ఏమిట్రా? ఏం జరిగింది?" ప్రశ్నించాడు వాచ్ మాన్.

"అమ్మగార్ని ఎవరో చంపేశారు?" మల్లయ్యగొంతు వణుకుతూ వుంది.

వెంటయ్య నిలువునా కంపించిపోయాడు.

క్షణాలలో కార్చిచ్చులా ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వర్కర్లందరికీ ఆ వార్త తెలిసిపోయింది. ఫ్యాక్టరీలో పని ఆగిపోయింది. అంతా గెస్టుహౌస్ ముందు గుమిగూడి వున్నారు.

పోలీస్ వ్యాన్ వచ్చింది.

ఇన్ స్పెక్టర్ కృష్ణమూర్తి తన బలగంతో దిగాడు.

పద్మావతి దగ్గరికెళ్ళి చూశాడు.

నిండా పాతికేళ్ళు లేవు ఆమెకు. ఎర్రగా బొద్దుగా వుంది. ముఖాన బొట్టులేదు. మెడలో సన్నటి గోల్డు లాకెట్ వుంది.

మెడమీద గాయంనుంచి కారిన నెత్తురువల్ల బెడ్ మీద దుప్పటి తడిసింది. గుండెల్లో కత్తి దిగివుంది.

హంతకుడు ముందు మెడమీద పొడిచాడు. తర్వాత గుండెలో పొడిచాడు.

ఆమె ప్రాణం ఇంకా పోలేదు. చావు బతుకులమధ్య కొట్టుకులాడుతోంది.

వెంటనే ఆమెను వానులో ఆస్పత్రికి తరలించాడు.

డాక్టర్స్ ఆమెను బ్రతికించడానికిప్రయత్నిస్తున్నారు. ఆమె బ్రతుకుతుందా? లేదా? అనే విషయం చెప్పడం కష్టం అన్నారు. ఇరవయినాలుగు గంటలు గడిస్తేగాని ఏ సంగతీ తేలదు అన్నారు.

వాచ్‌మాన్ చెప్పిన విషయాలను బట్టి మునిసిపల్ ఛైర్మన్ అప్పలనాయుడు గారి అబ్బాయి విజయ్ ఎనిమిది గంటల ప్రాంతంలో ఫ్యాక్టరీకి వచ్చాడనీ, గెస్టుహౌస్ లోకి వెళ్ళి కొన్ని నిమిషాల తర్వాత తిరిగివచ్చాడనీ, కారులో వెళ్ళిపోయాడనీ తెలిసింది.

అప్పలనాయుడు వూళ్ళోలేడు. ఇన్‌స్పెక్టర్ కృష్ణ మూర్తి విజయ్‌ని అరెస్టుచేసి స్టేషన్‌కి తీసుకొచ్చాడు.

"నన్ను నమ్మండి ఇనస్పెక్టర్. నేను వెళ్ళేసరికే ఆమెను యెవరో పొడిచారు. నాకు భయంవేసి తిరిగి వచ్చేశాను" అన్నాడు విజయ్.

"తిరిగి వచ్చినవారు మాకు రిపోర్టు ఎందుకివ్వలేదు?" ప్రశ్నించాడు ఇనస్పెక్టర్.

విజయ్ వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు.

"మీకు రిపోర్టు చెయ్యాలనే ఐడియా తట్టలేదు. ఆ నెత్తురు చూసేసరికి నేను అప్‌సెట్ అయ్యాను. కంగారుగా వచ్చేశాను" అన్నాడు నెమ్మదిగా.

"అసలు మీరు ఆ సమయానికి అక్కడికి యెందుకు వెళ్ళారు?"

"స్వంత పనిమీద వెళ్ళాను."

"రాత్రిపూటా?"

"ఆఁ....ఆ సమయానికి రమ్మని ఆమె చెప్పింది."

"అయితే ఆమె మీకు బాగా పరిచయస్తురాలే నన్నమాట."

"అవును సార్. ఆమె నా క్లాస్‌మేటే. మీతో అబద్ధం యెందుకు చెప్పాలి. ఒకప్పుడు మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలనుకొన్నాము" అంటూ జరిగిన కథంతా ఇన స్పెక్టర్‌కి చెప్పాడు విజయ్.

వల్లకాటి రామనాథం పేరున రాసిన లెటర్ కూడా ఇన్‌స్పెక్టర్‌కి చూపించాడు.

అంతా విని ఇన్‌స్పెక్టర్ నిట్టూర్చాడు.

"సారీ! మిష్టర్ విజయ్. నేను మీమీద కేసు పెట్టక తప్పదు. పరిస్థితులు అలా వున్నాయి. ఆ సమయంలో మీరు అక్కడికి వెళ్ళడం అదిచూసిన సాక్షులు వున్నారు. ఈ స్టేజిలో నేనేం చెయ్యలేను" అన్నాడు.

విజయ్ ముఖం విచారంలో మునిగింది.

"అదికాదు సార్! మీరు కేసును జాగ్రత్తగా ఇన్వెస్టిగేట్ చెయ్యండి. ఆమెకు యెవరయినా శత్రువులు వున్నారేమో? ఆమె బంధువులు ఎవరయినా ఈ అఘాయిత్యం చేశారేమో?" అన్నాడు విజయ్.

"ట్రై చేస్తాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

7

విజయ్ మర్డర్ కేసులో ఇరుక్కున్నాడనే మెసేజ్ రాగానే నిప్పులు తొక్కిన కోతిలా గెంతులేస్తూ వచ్చాడు అప్పలనాయుడు హైదరాబాద్‌నుండి.

"నీకు బుద్ధుందా లేదా? ఇల్లు కదలొద్దని చిలక్కి చెప్పినట్లు చెప్పిపోయాను. పొయ్యి పొయ్యి ఆ మర్డర్ కేస్‌లో ఇరుక్కున్నావ్! ఛీ....నా పరువు తియ్యడానికి పుట్టినట్లున్నావు" అంటూ తిట్టిన తిట్టు తిట్టకుండా అరగంట సేపు తిట్టాడు అప్పలనాయుడు కొడుకుని.

విజయ్ ముఖం కందగడ్డలా పెట్టుకొని తిట్లవర్షంలో తడుస్తూ కూర్చున్నాడు.

బెయిలుమీద కొడుకుని విడుదల చేయించి తీసుకొచ్చాడు గాని, లోలోపల హడలిపోసాగాడు. తనకు ఏదో దుర్దశ ప్రారంభమయిందని అనుకున్నాడు. కొడుక్కి

శిక్ష పడుతుందో ఏమో? ఆ వల్లకాటి రామనాథం జోస్యం నిజమవుతుందా? ఉరిశిక్ష పడుతుందా?

అప్పలనాయుడికి ఇంట్లో కాలు నిలవలేదు. లాయర్ ఇంటికి పరుగెత్తాడు. కొడుకుని ఈ కేసులోనుంచి యెలా తప్పించాలా అని ఒకటే ఆలోచనతో పిచ్చివాడిలా తనవున్న ఆస్తులచుట్టూ తిరుగుతూ మంతనాలు సాగిస్తున్నాడు.

పద్మావతిని పొడిచిన కత్తిమీద వేలిముద్రలు దొరకలేదు. అంటే హంతకుడు గ్లౌవ్స్ వుపయోగించి వుంటాడు.

అపోజిషన్ పార్టీ సుబ్బరాజుకి ఇదే అదనుగా యీ మర్డర్ కేసు గురించి చిలవలు పలవలు అల్లి తన సంపాదకత్వంలో నడుస్తోన్న లోకల్ పేపరు "ప్రజాగొంతు"లో ప్రచురించాడు. హంతకుడు విజయ్‌మీద పోలీసులు కేసు పెట్టారని జిల్లా మొత్తం పాకిపోయింది.

వెంకటస్వామితో పెళ్ళి సంబంధం చెడిపోవడంకంటె కొడుకు మర్డరు కేసులో ఇరుక్కోవడం అప్పలనాయుడి రాజకీయ జీవితానికి దెబ్బ తగిలింది.

'ప్రజాగొంతు'లో సుబ్బరాజు సంపాదకీయంలో మున్సిపాలిటీ తీరు తెన్నులమీద నిశితంగా విమర్శించాడు. చేర్మన్ కొడుకు తండ్రి అధికారాన్ని తనే చెలాయిస్తున్నాడనీ, టౌన్‌లో అతనొక గూండాగా తయారయ్యాడనీ, ఆఖరికి హత్యలు చెయ్యడానికిగూడా వెనుదియ్యడము లేదనీ రాశాడు.

"ఏదో గౌరవంగల కుటుంబం అని తొందరపడి పిల్ల నివ్వాలనుకున్నాను. తీరా శుభలేఖలు అచ్చయ్యాక తెలిసింది వాడొక రౌడీముండాకొడుకని. అందుకే ఆ సంబంధానికి సలాంపెట్టి వేరే సంబంధం చూసుకొన్నాను"

అని వెంకటస్వామిగూడా అక్కడక్కడా అన్నట్లు అప్పలనాయుడికి తెలిసి లోలో పెద్దపులిలా గాండ్రించాడు.

ఏమయితేనేం విజయ్ అదృష్టంవల్ల పద్మావతికి తెలివి వచ్చింది. నెమ్మదిగా కోలుకొంటోంది. ఆమెకు మాట్లాడే శక్తి వచ్చింది.

"నన్ను పొడిచింది మోహన్‌రావు" అని స్టేట్‌మెంటు ఇచ్చింది పద్మావతి.

మోహన్‌రావు ఆమె ఫ్యాక్టరీలో ఎక్కౌంటెంటుగా పనిచేస్తూన్నాడు. బికాం పాసయ్యాడు. సుమారు పాతికేళ్ళు వుంటాయి అతనికి. ఇంకా పెళ్ళికాలేదు.

అతను పద్మావతిని పెళ్ళి చేసుకోమని సతాయిస్తున్నాడు. ఆమె మాత్రం పెళ్ళికి ఒప్పుకోవడంలేదు. అంతే కాదు ఆమాట ఎత్తితే డిస్మిస్ చేస్తానని బెదిరించింది. దూరంగా వుంచింది. ఆ కసితో అతను సమయం చూసి కత్తితో పొడిచి పారిపోయాడు.

ఉప్పెనలో నుంచి బయటపడిన వాడిలా వూపిరిపీల్చుకున్నాడు అప్పలనాయుడు.

కొడుకుని వ్యాపారంలోకి దించితే తెలివి తక్కువతనంవల్ల యేదయినా గొడవ తెచ్చుకోవచ్చు. అదీగాక వల్లకాటి రామనాథం విజయ్‌ని బిజినెస్‌లోకి పంపవద్దని హెచ్చరించి వున్నాడు. ఎన్నో ఆలోచించి ఆఖరికి తాతయ్య అండ్ తాతయ్య టొబాకో కంపెనీలో అసిస్టెంటు బయ్యర్ వుద్యోగానికి ట్రై చేశాడు.

అప్పలనాయుడితో తాతయ్యకున్న పరిచయంవల్ల పొగాకు గురించి విజయ్‌కి యేమీ తెలియకపోయినా

వుద్యోగం ఇవ్వడానికి అంగీకరించాడు. ఆ వుద్యోగం కూడా ఆ వూళ్ళోకాదు. దాదాపు టౌనుకి ఏభైమైళ్ళ దూరంలోవున్న చిలకాపురంలో. అదొక చిన్న టౌన్. బాగానే వుంటుంది అనుకున్నాడు అప్పలనాయుడు.

మర్నాడు దశమి. మంచిరోజు. తాతయ్యా అండ్ తాతయ్యా టొబాకో కంపెనీ ఆఫీసుకెళ్ళి అప్పాయింటు మెంటు ఆర్డరు తీసుకొని చిలకాపురం వెళ్ళి వుద్యోగంలో చేరమని అప్పలనాయుడు కొడుకుతో చెప్పాడు.

తండ్రి చెప్పినట్లే టొబాకో కంపెనీ ఆఫీసుకు వెళ్లాడు విజయ్. అక్కడ తాతయ్యా లేడు. అపాయింటు మెంటు ఆర్డర్సు టైపుచేశాక తాతయ్యా వాటిమీద సంతకాలు చెయ్యలేదట. పైగా ఆఫీస్ కాపీమీద క్యాన్సిల్ అని రాశాడుట. అదంతా మేనేజర్ చెప్పాడు విజయ్‌కి.

ఉద్యోగం ఇస్తానని నమ్మకంగా చెప్పినవాడు యిలా యెందుకు చేశాడో విజయ్‌కి అర్థంగాలేదు. ముఖం నల్లగా మాడ్చుకుని వచ్చేశాడు విజయ్.

జరిగిందంతా తెలుసుకొని అప్పలనాయుడు తాతయ్యా కోసం యింటికి వెళ్ళాడు. తాతయ్యా ఇంట్లోనే వున్నాడు.

"రావయ్యా! నాయుడూ" అంటూ ఆహ్వానించాడు.

నాయుడికి తాతయ్యామీద కోపంగా వుంది.

"మా వాడికి గతిలేక నిన్ను వుద్యోగంలో పెట్టుకో మని ప్రాధేయపడలేదు. కొన్నాళ్ళు ఈ వూళ్ళోలేకుండా వుంటే ఏ గొడవా వుండదని అనుకున్నాను. వాడి జాతకము బాగోక పెళ్ళి ఆగిపోయింది. కేసులో యిరుక్కుని బయటపడ్డాడు" అన్నాడు అప్పలనాయుడు.

తాతయ్యా నవ్వి "నామీద కోపం వచ్చినట్లుందే" అన్నాడు.

"కోపంకాదు. అసలు సంగతి చెప్పావు" అన్నాడు.

"అదంతా నువ్వు నాకు చెప్పావుగదా! చెప్పాకనే గదా మీ వాడికి వుద్యోగం ఇవ్వడానికి ఒప్పుకున్నాను. నిజానికి ఆ వుద్యోగం యెంతో అనుభవం వున్న వాడికి యివ్వాలి. మీ వాడికి పొగాకు ఎట్లావుంటుందో తెలియక పోయినా ఎందుకిస్తానన్నాను? నీమీద అభిమానం వుండ బట్టేగదా?" అన్నాడు తాతయ్య.

"మది ఇస్తానని చెప్పి నువ్వు చేసిందేమిటి?" నిష్టూరంగా అన్నాడు అప్పలనాయుడు.

"నన్నేం చెయ్యమంటావ్? నాకు అప్పుడే చావాలని లేదు" అన్నాడు తాతయ్య.

అప్పలనాయుడు వులిక్కిపడ్డాడు.

"ఏమిటి నువ్వనేది?" ఆశ్చర్యంతో ప్రశ్నించాడు.

"మీ వాడికి వుద్యోగం ఇస్తే వారం లోపల చంపుతానని బెదిరించాడు. ఇప్పుడు చెప్పు? మీ వాడికి వుద్యోగం ఇచ్చి నన్ను చావమంటావా? నా సీట్లో నువ్వుంటే యేం చేస్తావ్? చావడానికి సిద్ధపడతావా?" గంభీరంగా అన్నాడు తాతయ్య.

"మా వాడికి వుద్యోగం ఇస్తే వారంలోపల నిన్ను చంపుతానని బెదిరించాడా? ఎవడు వాడు?"

"ఎవడో నాకేం తెలుసు? తన పేరు వల్లకాటి రామనాథం అన్నాడు."

అప్పలనాయుడికి ఆ పేరు వింటూనే ముఖం కళ తప్పింది.

"ఎవడయ్యా వాడు? వాడికీ నీకూ విరోధం ఏమిటి' అని ప్రశ్నించాడు తాతయ్య.

వాటికి సమాధానం అప్పలనాయుడికి తెలిస్తేగదా చెప్పడానికి?

8

నీలిమబార్‌లో ఒంటరిగా కూర్చుని పీటర్ స్కాట్ విస్కీ ఫుల్ బాటిలు ముందు పెట్టుకొని త్రాగుతూ ఆలోచిస్తున్నాడు విజయ్.

ఎవడీ కల్లకాటి రామనాథం?

తనను యెందుకిట్లా వెంటాడుతున్నాడు?

పద్మావతి యింకా హాస్పిటల్లోనే ట్రీట్ మెంటు తీసుకుంటున్నది. ఆమెను అనుమానించడం బుద్ధితక్కువ పని.

తనకు గుర్తులేని శత్రువు యెవడో వున్నాడు.

విజయ్ తలలో ఆలోచనలు గిరగిరా తిరుగుతున్నాయి. తనుచేసిన దుర్మార్గాలు జ్ఞప్తికి తెచ్చుకోడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

నీలిమబార్ మేడపైన కూర్చున్న విజయ్‌కి రోడ్డుమీద వెళుతున్న జనం కనిపిస్తున్నారు. కార్లు, రిక్షాలు వేగంగా పోతున్నాయి.

రాత్రి తొమ్మిది దాటింది.

ఆ రోడ్డులో వున్న సినిమాలు వదలినట్లున్నారు. జనం గుంపులు గుంపులుగా పుట్టలు పగిలినట్లుగా రోడ్డు నిండి పోయారు. పావుగంటపాటు ప్రవాహంలా కదిలారు జనం.

రెండో ఆట సినిమాకు వెళ్ళేవాళ్లు సరదాగా నడిచి పోతున్నారు. జంటలు జంటలుగా కొందరు, గుంపులు గుంపులుగా కొందరు.

పీటర్ స్కాట్ బాటిల్ సగం ఖాళీ అయ్యింది. విజయ్ ముందున్న టీపాయ్ మీద నాన్ వెజిటేరియన్

డిపోజిట్ పాతవిపోయి క్రొత్తవి వస్తున్నాయి.

విజయ్ సిగరెట్ వెలిగించి పొగ కిటికీలోనుంచి వదులూ రోడ్డువైపు దృష్టిసారించి వచ్చేపోయేవారిని చూస్తున్నాడు. మత్తు బాగా తలకెక్కింది. కళ్ళు మూతిలుపడుతున్నాయి బరువుగా.

ఒక్కసారిగా విజయ్ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవి అయ్యాయి.

రోడ్డుమీద ఒంటరిగాపోతున్న ఆమెను రెప్పకొట్టకుండా ఆదేపనిగా చూశాడు.

ఆమె ఎత్తుగా, దానికితగ్గ లావుతో, ఆలివ్ గ్రీన్ కలర్ నైలెక్స్ చీర, అదే రంగు బ్లౌజుతో తలవంచుకుని అడుగులు వేస్తోంది.

'అవును ఆమె అచ్చు అలాగే వుంది' అనుకున్నాడు.

అతనికి ఆ రోజు గుర్తుకొచ్చింది.

ఆ రోజు....షుమారుగా మూడు నెలల క్రితం.... విజయ్ తమ సిటీబస్‌లమీద సూపర్ విజన్‌కి వెళ్ళాడు.

ఇరవై రెండో నెంబర్ సిటీ బస్సులో ఆమెను చూసి గుండెల్లో అలజడి బయలుదేరింది. కళ్ళు త్రిప్పుకోలేనంత అందంగావుంది ఆమె.

ఆమె చాల ఎత్తుగావుంది. అంత ఎత్తు ఆడవాళ్ళని అతను ఎప్పుడూ చూళ్ళేదు. పాత హిందీ సినిమాల్లో నూతన్ అంత ఎత్తు వుందామె. అతన్ని బలంగా ఆకర్షించడానికి బహుశా అదొక కారణమై వుండొచ్చు.

సూపర్ విజన్ సంగతి మర్చి ఆమెకు ఎదురు సీట్లో కూర్చుని పిచ్చివాడిలా చూడసాగాడు. ఇరవై రెండో నెంబర్ సిటీబస్ లేడీస్ పాలిటెక్నిక్ వరకూ వెళ్తుంది. ఆ కాలేజీ టౌన్‌కి దాదాపు రెండుమైళ్ళ దూరంగా

వుంది. అక్కడే హాస్టల్ గూడా వుంది.

అప్పుడు సాయంకాలమైంది. విజయ్ అప్పటికి రెండు బీరుసీసాలు త్రాగివున్నాడు. మత్తు మత్తుగా వుంది మనసు. ఆ మత్తు మనసులో బలంగా నాటుకుపోయింది కోరిక. ఆమెను పొందాలనే కోరిక త్రాచులా బుసలు కొట్టింది.

ఆమె ఆ కాలేజీ స్టూడెంట్ కాదు. అందులో ఎవరి కోసమో వచ్చివుంటుంది. అందుకే ఆమె కండక్టర్ని వివరంగా అడుగుతూవుంది పాలిటెక్నిక్ హాస్టల్ ఎంత దూరం వుందని.

ఇంకొక్క ఫర్లాంగులో పాలిటెక్నిక్ కాలేజీ, హాస్టల్ వచ్చేస్తాయి. ఆ స్టేజిలో అంతా దిగిపోయారు. ఆమె ఒంటరిగా వుంది.

విజయ్ మనసులో ఒక ఆలోచన మెరుపులా మెరిసింది. డ్రైవర్ని బస్సు ఆపమన్నాడు. ఒక చెట్టు ప్రక్కనే బస్సు ఆపాడు డ్రైవర్. అందులో ఇంకా కండక్టర్, క్లీనర్ మాత్రమే వున్నారు.

వాళ్ళు బస్సు దిగారు. విజయ్ వాళ్ళకి చెప్పాడు దూరంగా పొమ్మని. ఎవరైనా వచ్చి అడిగితే ఆ తర్వాత తనెవరో తెలియదని చెప్పమన్నాడు. డ్రైవర్ ముందు అందుకు ఒప్పుకోలేదు. కాని వుద్యోగంలోనుంచి తీసేస్తానని బెదిరిస్తే చేసేదేంలేక దిగిపోయాడు.

అప్పుడు విజయ్ ఆమెను రాక్షసంగా మానభంగం చేశాడు. ఆమెను ఆ తర్వాత హాస్టల్ దగ్గర దించి వచ్చేశారు బస్ స్టాఫ్.

అప్పటివరకూ మధ్యలో వెయిట్ చేస్తూ రోడ్డువారగా నిల్చునివున్నాడు విజయ్.

ఆ తర్వాత స్టాఫ్ ముగ్గురికీ మూడువందల నోట్లు ఇచ్చి తన గురించి ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించాడు.

ఆమె మాత్రం అవమానంతో దహించుకుపోయింది. ఆ రాత్రే రైలుక్రిందపడి ప్రాణాలు తీసుకుంది.

ఆమె శవాన్ని పాలిటెక్నిక్ కాలేజీ స్టూడెంట్ రాగిణి గుర్తించింది. రాగిణి అక్క లలిత ఆమె. చెల్లెల్ని చూడ్డానికి వెళ్తుండగా విజయ్ చేతిలో శీలం కోల్పోయింది.

లలిత ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ఆమెను మానభంగం చెయ్యడంవల్లనే అని పోస్టుమార్టంలో వెల్లడైంది.

కాని ఎవరో అంతుబట్టలేదు. పోలీసులు ఇరవై రెండో నెంబర్ బస్సుస్టాఫ్ని ప్రశ్నించారు కాని ప్రయోజనం లేకపోయింది.

లలిత అన్న ప్రతాప్ ఆ తర్వాత అదే వూరికి బదిలీ మీద వచ్చాడు. అతను ఒక గవర్నమెంట్ ఆఫీసులో పనిచేసేవాడు.

అతను వచ్చాక తన చెల్లెలిమరణానికి కారణం ఎవరో తెలుసుకోవాలని ఎంతో ప్రయత్నించాడు. బస్సుస్టాఫ్కి డబ్బుగూడా ఇస్తాననీ అతను ఎలా వుంటాడో చెప్పమన్నాడు. కాని తమకి ఏమీ తెలియదని బుకాయించారు.

లలిత పర్సులో వున్న సిటీబస్ టికెట్టునిబట్టి ఆమె ఆ బస్సులోనే వచ్చిందని పోలీసులకు అనుమానం వచ్చింది. కాని ఆమె హాస్టల్ దగ్గర దిగి వెళ్ళిపోయిందని కండక్టర్ గట్టిగా చెప్పాడు.

అలా ఆ కేసులో తప్పించుకున్నాడు విజయ్.

ఒక వేళ లలిత అన్న ప్రతాప్ గాని వల్లకాటి రామనాథం పేరుతో తనని బాధించడం లేదుగదా?

ప్రతాప్‌కి తనే లలితను చెరిచాడని ఎలా తెలిసింది? ఎలా తెలుస్తుంది?

ఆ రోజు బస్సులో వున్న స్టాఫ్‌లో ఎవరైనా చెప్పి వుంటారా?

విజయ్ తల ఆలోచనలతో పగిలిపోతోంది.

9

మర్నాటినుంచి ప్రతాప్ పనిచేస్తున్న ఆఫీసు దగ్గర కాపు వేశాడు విజయ్. అతని చర్యలన్నీ గమనించసాగాడు. అతని ఇల్లుగూడా తెలుసుకున్నాడు.

కాని అతని దినచర్య అనుమానాస్పదంగా లేదు. అతను వుదయం తొమ్మిదింటికి ఆఫీసునుంచి బయల్దేరతాడు. ఇక సాయంకాలం ఆఫీసు వదిలాక పేకాట ఆడి ఏ పదింటికో ఇంటికి జేరుకుంటాడు.

ప్రతాప్‌ని పూర్తిగా అనుమానించకుండా గూడా వుండడానికి వీల్లేదు. ఫోన్ ద్వారా బెదిరించడానికీ, వుత్తరాల ద్వారా హడలగొట్టడానికి బైటపడాల్సిన పనిలేదు. అతను తన చర్యల ద్వారా పిచ్చివాడిని చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు. తనకి మనశ్శాంతిలేకుండా చేసి చివరకు ఏదో ఒక రోజున తనని మర్డర్ చేస్తే?

విజయ్‌గుండె ఆగిపోయినట్లయింది.

అతను ఒంటరిగా ఆలోచనలో పిచ్చెక్కిపోతున్నాడు. అసలు తన అనుమానాలు ఆధారాలులేనివి. ప్రతాప్‌కి తనే అతని చెల్లెల్ని బలవంతంగా చెరిచాడనే సంగతి తెలుసా? లేదా?

అతనుకాక ఇంకెవరు తనపై ఇంత పగపట్టి వుంటారు?

ప్రతాప్ చదువుకున్నవాడు. తన సంగతి తెలిసి ఇలా వల్లకాటి రామనాథం పేరుతో హడలగొట్టేస్తున్నాడేమో? ఆ విధంగా పగతీర్చుకుంటున్నాడేమో?

తను చేసిన దుర్మార్గానికి సాక్షులు ముగ్గురే.

కండక్టర్ తిరుపతి, క్లీనర్ శివయ్య, డ్రైవర్ సింహాచలం. వాళ్ళనే కనుక్కుంటే?

వాళ్ళు నిజం చెప్పరని తెలిసినా తన మనశ్శాంతి కోసం కండక్టర్ని, క్లీనర్ని ఏకాంతంగా అడిగాడు. వాళ్ళు దేవుళ్ళమీద, అమ్మా అయ్యలమీద పెళ్ళాం బిడ్డ మీదా ప్రమాణాలు చేశారు. తాము ఆ రోజునుంచి ఎవరితోనూ ఏమీ చెప్పలేదన్నారు.

డ్రైవర్ సింహాచలం మాత్రం అంతా విని, "మీ అనుమానం నిజమే" అన్నాడు.

విజయ్ కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"మీకు తెలియదుగాని మన కండక్టర్ తిరుపతి వట్టి డబ్బు మనిషి. వాడే వెయ్యిరూపాయలకు లొంగిపోయి గుట్టు రట్టు చేశాడు" చెప్పాడు.

"నిజమా?"

"నాకు అంతా తెలుసు. మీరు ఎక్కడా బైట పడకండి. ఇదంతా ఆ ప్రతాప్ చేయిస్తున్నాడు. తను మాత్రం తెర వెనుక వున్నాడు."

"ఎవరితో?"

"జగన్ అని ఒకడున్నాడు. డబ్బిస్తే ఎంతపనైనా చేస్తాడు."

"ఎక్కడుంటాడు వాడు?"

"వాడికి మీరు ఎక్కువ డబ్బిస్తే తనని నియమించిన ప్రతాప్ నే మర్డర్ చేసేస్తాడు. జగన్ కి నీతి నియమాలు

ఏమీ లేవు."

"నాకంతా అయోమయంగా వుంది."

"భయపడకండి. జగన్ నాకు తెలుసు. చీకటిపడ్డాక డబ్బు తీసుకుని రండి. రేపే ప్రతాప్ శవం ఏ లారీ క్రిందనో పడి నుజ్జునుజ్జయిపోతుంది."

"ఎంత తీసుకురమ్మంటావు?"

"పదివేలు తీసుకురండి. మర్డర్ చేయాలిగదా!" అన్నాడు సింహాచలం.

"అలాగే!....ఎన్నింటికి రమ్మంటావు?"

"ఏడింటికి రండి. నేను రెడీగా వుంటాను" అన్నాడు సింహాచలం.

10

సింహాచలం మోటారుసైకిల్ నడుపుతుంటే, విజయ్ వెనుక కూర్చున్నాడు.

టౌన్ దాటిన రెండు మైళ్ళ తర్వాత చిన్న కొండ వుంది. ఆ కొండమీద ఒక గుడివుంది.

కొండ దిగువ బండి ఆపాడు సింహాచలం.

"అతను ఇంతదూరంలో ఈ ఏకాంత ప్రదేశంలో ఎందుకుంటున్నాడు?" ప్రశ్నించాడు విజయ్.

సింహాచలం నవ్వి "భలేవారు సార్! ఖూనీలు చేసేవాడు జనం మధ్య వుంటే బ్రతకనిస్తారా?" అన్నాడు.

తర్వాత ఇద్దరూ కొండపైకి ఎక్కారు.

సింహాచలం బ్యాటరీలైటుతో దారి చూపుతూవుంటే విజయ్ ఎక్కుతున్నాడు.

కొండపైకి ఎక్కారు. దూరంగా షుమారు మైలు దూరంలో ఒక పల్లెటూరు వుంది. దీపాలు మినుక్కు మినుక్కుమని వెలుగుతున్నాయి.

గుడి చిన్నదే.

"పదండి సార్!" అన్నాడు సింహాచలం.

విజయ్ గుమ్మం దాటాడు.

మెడమీద గట్టిగా దెబ్బపడింది. బోర్లాపడ్డాడు. పడ్డవాడిని లేవకుండా పెడరెక్కలు విరిచికట్టాడు సింహాచలం. కదలకుండా కాళ్ళు కట్టేసి ఒక మూల కూర్చోబెట్టాడు.

విజయ్ గట్టిగా కేకలు పెడుతున్నాడు.

సింహాచలం తాపీగా బీడీ ముట్టించి "ష్!....అరవకురా బద్మాష్! అరిచినా నీ నోరు నొప్పి తప్ప పలికే దిక్కు లేదు. అందుకే దేవుణ్ని ప్రార్థించుకో. ఆఖరి ఘడియలు దగ్గరికొచ్చాయి" అన్నాడు.

"ఒరేయ్ సింహాచలం! నమ్మించి మోసం చేస్తావురా!" కోపంతో పళ్ళుకొరికాడు విజయ్.

"మరి నమ్మకుండా మోసం ఎలా చేస్తారురా బేవకూఫ్."

"నీకు నేనేం ద్రోహం చేశాను. చెప్పు నన్ను ఎందుకు మోసం చేశావ్?"

"చెప్తా చే!....చెప్తా!....అన్నీ చెప్తా!వల్లకాటి రామనాథం అంటే ఎవడో కాదురా!.... నేనే...." అన్నాడు సింహాచలం.

"నువ్వా!...."

"ఆఁ.... నేనే...."

"ఒరేయ్! సింహాచలం. ఎందుకురా నన్నిలా బాధిస్తున్నావ్? చెప్పు నీకెంత డబ్బు కావాలో!"

"నాకు డబ్బు కాదురా కావాల్సింది. నీ ప్రాణం!"

"ఎందుకు? నీకు నేనేం అన్యాయం చేశాను."

"నువ్వు ఎందరికి ఎన్ని అన్యాయాలు చేసావో నీకు గుర్తులేదా? చెల్లెల్ని చూడ్డానికి ఆశగా వెళ్తున్న లలితను దారుణంగా బస్సులోనే చెరిచావే!"

"అది తప్పే. నేను ఒప్పుకుంటున్నాను."

"తప్పు ఒప్పుకుంటే సరిపోదురా! దానికి శిక్ష అనుభవించాలి.... ఈ గొడవంతా ఎందుకు నిన్ను నేను ఎందుకు బాధించానో.... ఎందుకు చంపదల్చుకున్నానో చెప్తాను విను.

లలిత తన చెల్లెల్ని చూడ్డానికి వెళ్తున్నప్పుడు నువ్వు ఎలా మానభంగంచేసి ఆమె జీవితాన్ని నాశనంచేశావో! అలాగే.... నా చెల్లెలు.... నా కోసం టౌన్‌కి వచ్చింది సంవత్సరం క్రితం నన్ను కలుసుకోవడానికి. దాన్ని ఎవడో దుర్మార్గుడు మాయమాటలు చెప్పి నేను తనకి తెలుసనీ ఇల్లుమారాననీ నమ్మించి ఒకపాడుబడిన ఇంటికి తీసుకెళ్ళి చెరిచాడురా! అది అవమానం భరించలేక జరిగిందంతా ఉత్తరం రాసి రైలుక్రిందపడి చచ్చిపోయింది.

అప్పట్నుంచీ చూస్తున్నా.... దాన్ని చెరిచినవాడు చిక్కితే కసితీరా చంపాలని. కాని దొరకలేదు. ఇన్నాళ్ళ తర్వాత నువ్వు అదే తరహాలో లలితను మానభంగం చేశావు. లలితగూడా రైలు క్రిందపడి చచ్చిపోయింది. ఆ రోజునే నిర్ణయించుకున్నా నువ్వే నా చెల్లెల్ని గూడా చెరిచినవాడివని...."

"నో.... సింహాచలం.... నో.... నేను కాదు నీ చెల్లెల్ని చెరిచింది."

"కాదు.... నువ్వే...."

"సింహాచలం.... కాదు. నువ్వు పొరబడుతున్నావు.

నీ చెల్లెల్ని మోసంచేసి చెరిచింది నేను కానే కాదు. నన్ను వదిలెయ్!....నువ్వు కోరినంత డబ్బు ఇస్తాను" విజయ్ ఆక్రోశిస్తున్నాడు ప్రాణభయంతో.

సింహాచలం వికటంగా నవ్వాడు.

"నిన్ను వదలాలా?....అది కల్ల. నువ్వు విషపురుగువి... నిన్ను వదిలితే ఇంకెందరి జీవితాలని నాశనం చేస్తావో?... నా చెల్లెల్ని చెరిచింది నువ్వు కాకపోయినాసరే....లలితే నా చెల్లెలు అనుకుంటున్నా!....లలితను చెరిచినందుకై నా నిన్ను చంపుతాను. అప్పటికిగాని నా గుండెలోని మంటలు చల్లారవు...."

అంటూ సింహాచలం చటుక్కున ఆరంగుళాల కత్తి తీసి విజయ్ గుండెల్లో కసితీరా పొడిచాడు.

అంతే—

విజయ్ హృదయవిదారకరమైన చావుకేక ఆ కొండల్లో ప్రతిధ్వనించింది.

—:ఐపోయింది:—